విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 29 జులై 2025 8 పేజీలు

టీడీపీ, వైసీపీలో అంతర్మధనం

విశాలాంధ్ర - గిద్దలూరు : టీడీపీ, వైసీపీ నాయకుల్లో అంతర్మధనం వెంటాడుతోంది. ఏడాది పాలనలో ఏం చేశాం..ఏం చెప్పాలి అన్ని హామీలు పూర్తి చేశామని చెప్పాలా..త్వరలో పూర్తి చేస్తామని చెప్పాలా అనే డైలమాలో టీడీపీ నేతలు ఉన్నారు. మరో వైపు వైసీపీ నేతలు టీడీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు చేయకుండా విజయోత్సాహాలు చేస్తున్నారని ప్రజలకు తెలియజేప్పేందుకు నానా తంటాలు పడుతున్నారు. అయితే ఈ ప్రయత్నంలో వైసీపీలో నేతల మధ్య కుమ్ములాటలు తప్పటం లేదు. ప్రభుత్వ వైఫల్యాలను చూపెట్టాల్సిన పనికంటే అంతా ఒక్కతాటిపైకి రావటమే గగనమై పోయింది. ఒకరికి ఒకరితో పొసగటం లేదు. ఏడాది పాలన పూర్తి కావటంతో 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరట ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లి టీడీపీ నేతలు తెలియజేస్తున్నారు. మరల స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పనిచేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇక వైసీపీలో మార్కాపురం, గిద్దలూరు స్థానాలు కోల్పోయి పార్టీ ఇన్చార్జిలుగా ఎమ్మెల్యే అభ్యర్థులు కొనసాగుతున్నారు. గిద్దలూరులో రోజు ఒకరి పేరు వినిపిస్తుండగా, ఇన్చార్జి కేపీ నాగార్జున రెడ్డి అప్పుడప్పుడు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పార్టీని నడిపించే నాయకుడు ఎవరో తెలియని అయోమయ పరిస్థితిలో వైసీపీ అభిమానులు ఉన్నారు. కేపీ ఇన్చార్జిగా ఉన్న కార్యక్రమాల్లో పాల్గొనకపోవటం కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తుంది. ఈ

- ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోని వైసీపీ నేతలు
- గొప్పలు చెప్పుకునేందుకు తెలుగు తమ్ముళ్ల ఉత్సాహం

నేపథ్యంలో 'బాబు షూరిటీ మోసం గ్యారంటీ' పేరిట గిద్దలూరులో జిల్లా నాయకులు వైసిపి ముఖ్యులతో సమావేశం ముగించగా అక్కడ కూడా మాటకు మాట తుఫానులా వైసిపి మూడుముక్కలాట ఆడింది. మాజీ శాసనసభ్యుడు అన్నా రాంబాబు వల్ల తమకు అన్యాయం జరిగిందని ఆ పార్టీలో నేతలపై విమర్శలు గుప్పిస్తుండగా, మరోవైపు మాజీ ఎమ్మెల్యే కుమారుడు యువ నాయకుడు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి హాజరు కాకపోవడం పిలవకపోవడం వంటి కారణాల చేత అసంతృప్తి గానే సమావేశం ముగిసింది. మాజీ శాసనసభ్యులు కేపీ నాగార్జున రెడ్డి మిగతా 2 లో ...

దత్తత కుటుంబాల్లో కలెక్టర్ మురళి వెలుగులు

- జీవనోపాధికి చేయూత
- ఒక్కొక్కరికి రూ.65 వేల ఆర్థిక సాయం
- ముగ్గురు యువకులకు లెర్నింగ్ లైసెన్సులు అందజేత

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా కలెక్టర్ దత్తతకు తీసుకున్న చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కోనేటి నరసింహారావు, కోనేటి చింతయ్య, ఉప్పు లక్ష్మయ్యలకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జె.వెంకట మురళిని కలిశారు. పీ-ఫోర్ కార్యక్రమం కింద ఈ యువకుల భవిష్యత్‌కు బాసటగా నిలిచిన కలెక్టర్, స్వయంగా లెర్నర్ లైసెన్సులు అందజేశారు. లైసెన్సులతో పాటు జీవనోపాధి కోసం ఆటోలు కొనుగోలు చేయడాన్ని ప్రోత్సహిస్తూ ఒక్కొక్కరికి రూ.65 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. మిగిలిన మొత్తానికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరయ్యేలా సంబంధిత శాఖలతో చర్చించి మద్దతు పొందారు. ప్రభుత్వ పాలనలో మానవీయతను ప్రదర్శించిన కలెక్టర్ మురళికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం ఎందుకు?

వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర -తాళ్లూరు: పేదలకు సాయం చేసే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదని, ఈ ప్రభుత్వం ఎందుకని వైసీపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి విమర్శించారు. తాళ్లూరు మండల కేంద్రంలో సోమవారం బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తో కలసి ఆయన ముఖ్య అతిథిగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసారని నాడు వైసీపీ సొమ్ము కాదు కదా అని టీడిపి శ్రేణులు అన్నారని నేడు మరి అదే ప్రజల సొమ్ము పార్టీలకు కులాలకు అతీతంగా అందించటానికి ఏమి అయ్యినదని అన్నారు. నేడు ఒక సీఎం స్థాయిలో చంద్రబాబు వైసీపీ వారికి సంక్షేమ పథకాలు ఇస్తే పాముకు పాలు పోసిపెంచినట్లే అని ఎలా అంటారని అన్నారు. సూపర్ సిక్స్ అని అలవీ కాని హామీలు ఇచ్చి నేడు అవి మాఫీ చేసుకోవటానికి వైసీపీ ప్రధాన నాయకులపై లిక్కర్ మరకలు అంటిస్తున్నారని అన్నారు. నాడు ప్రభుత్వమే మిగతా 2 లో ...

'తల్లికి వందనం' అర్జీలను వేగంగా పరిష్కరించాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : తల్లికి వందనం పథకంలో గ్రీవెన్స్‌లను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. అభివృద్ధి సంబంధిత కార్యక్రమాలపై సోమవారం ఆమె ప్రకాశం భవనము నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తల్లికి వందనం పథకంలో ఈ-కేవైసీలను మంగళవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. హౌసింగ్ పథకంలో ప్రతివారం స్పష్టమైన పురోగతి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పలు మండలాలలో ఏ.ఈ.ఈ. పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఇది ప్రభావం చూపుతున్నదని హౌసింగ్ పి.డి. శ్రీనివాస ప్రసాద్ ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ చురుకుగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఈ బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. మంగళవారం సాయంత్రంలోగా దీనికి సంబంధించిన జాబితాను తనకు పంపాలన్నారు. ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. వచ్చామా... నా పని చేసుకున్నామా... వెళ్ళామా... అనే ధోరణితో కాకుండా ప్రజలతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కలెక్టర్ చెప్పారు. సిబ్బంది పనితీరుతో పాటు ప్రవర్తన కూడా అత్యంత కీలకమని ఆమె ఉద్ఘాటించారు. పీ - 4 పథకంలో మార్గదర్శకులను త్వరగా గుర్తించాలని కలెక్టర్ చెప్పారు. ఇప్పటికే గుర్తించిన జాబితాలో అర్హులకు స్థానం లేనట్లయితే అలాంటి వారిని కూడా గుర్తించేందుకు గ్రామ సభలను త్వరగా నిర్వహించాలని అన్నారు. పారిశుద్ధ్యంతో పాటు ఇతర సేవలపై ఐ.వి.ఆర్.ఎస్. ద్వారా ప్రభుత్వం నేరుగా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నందున ఆయా సేవల నిర్వహణలో నిర్లక్ష్యం ఎంతమాత్రమూ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ దిశగా క్షేత్రస్థాయి సిబ్బందిపై స్థానిక అధికారులు నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని ఆమె చెప్పారు. ఉపాధి హామీ పథకములో వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టడానికి అధిక ప్రాధాన్యమిచ్చి వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉద్యాన పంటల సాగు, ఫారం పాండ్స్, ఫిషింగ్ పాండ్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. జిల్లాలో వ్యవసాయ పనులు ఇంకా ఊపందుకోనందున ఉపాధి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సంరక్షణ కోసం చేపట్టే పనుల ఫోటోలను తనకు పంపించడంతో పాటు సంబంధిత కేంద్ర ప్రభుత్వ వెబ్ సైట్ లో కూడా అప్లోడ్ చేయాలని అన్నారు. పల్లె పండుగ -2 లో భాగంగా ప్రభుత్వం మన జిల్లాకు 1458 క్యాటిల్ షెడ్స్‌ను లక్ష్యంగా నిర్దేశించినందున వీటికి త్వరగా అనుమతులు తీసుకుని నిర్మాణ పనులు చేపట్టేలా దృష్టి సారించాలని కలెక్టర్ చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీ.డీ. జోసఫ్ కుమార్, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, సిపిఓ స్వరూప రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు

- రాష్ట్రస్థాయిలో జిల్లాకు 19వ స్థానం - కలెక్టర్ ఆగ్రహం

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ఏమాత్రం అలసత్వం చూపినా సహించబోమని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి స్పష్టంగా హెచ్చరించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అధికారులు తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిపత్రాన్ని తక్షణమే పరిష్కరించేలా పూర్తిబాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా మొత్తం 200 వినతులు అందగా, పలు సమస్యలకు తన సమక్షంలోనే పరిష్కార సూచనలు ఇచ్చారు. మిగిలిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థాయిలో పరిష్కారానికి సంబంధించిన విషయాలను రాష్ట్రానికి నివేదించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సమీక్షలో బాపట్ల జిల్లా 19వ స్థానంలో నిలవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ఇది జిల్లా అధికారుల పనితీరుకు ప్రతిబింబమని వ్యాఖ్యానించారు. ఇకపై ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని, పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాబోయే సమీక్షలో జిల్లా స్థానం మెరుగుపడకపోతే, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏ ఒక్క అధికారిని కూడా ఉపేక్షించబోమని, తగిన కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్, ఆర్డీఓ గ్లోరియ, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

తహసీల్దార్ వాసుదేవరావు

విశాలాంధ్ర పామూరు : ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావు హెచ్చరించారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయం లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వగ్గంపల్లిలో సర్వేనెంబర్ 521/3లో 4 ఎకరాల 10 సెంట్లు ప్రభుత్వ భూమిలో ఎవరు దిగిన చట్టపరమైన హెచ్చరిస్తూ బోర్డు లు ఏర్పాటు చేశామని తెలిపారు. వృద్ధులకు, వికలాంగులు 60 సంవత్సరాలు దాటిని వారికి 26 నుండి 30వ తేదీ వరకు రేషన్ సరుకులను ఇంటి వద్దకే తీసుకొస్తారని తెలియజేశారు.

విద్యార్థులకు న్యాయ సలహాలపై అవగాహన

విశాలాంధ్ర-పామూరు రూరల్ : విద్యార్థులకు న్యాయ సలహాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని సీఐ భీమా నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ పాఠశాల లో సోమవారం న్యాయ సలహాల, ప్రమాదాలు, మరియు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భీమ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి న్యాయ సలహాలపై అవగాహన కలిగి ఉండాలని, పలు సలహాలు సూచనలు అందజేశారు. అంతేకాకుండా విద్యార్థులకు మాదకద్రవ్యాలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.రోడ్డు ప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు చక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని వారు తెలియజేశారు. అంతేకాకుండా సైబర్ నేరగల పట్ల అప్రమత్తంగా ఎలా ఉండాలో వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై టి కిషోర్ బాబు , ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్మధనం

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గంలో ఉంటే విజయం తమదేనంటూ ఆ పార్టీ నాయకులు నమ్మ పలుకుతున్నారు. ఈ నేపథ్యంలోనే కేపీ, పిడతల, అన్న..మూడు వర్గాలుగా మారటంతో వైసీపీలో కుమ్ములాటలు తప్పటం లేదు. ఈ సమయంలో రాచర్లలో 29వ తేదీన వైసిపి నాయకులు బాబు షూరిటీ మోసం గ్యారంటీ పేరుతో రాచర్ల మండలంలో నిర్వహించడానికి ఏర్పాటు చేస్తుంది. ఆ సమావేశంతో వైసిపి పుంజుకుంటుందని వైసిపి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ అభిమన్యుడుగా పేరుపొందిన గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి నాలుగు మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఆగస్టు 4వ తేదీన కంభం, గిద్దలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ డైరెక్టర్ల ప్రమాణస్వీకారాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడానికి నిమగ్నమై మార్కెట్ యార్డును పరిశీలించారు. గిద్దలూరు నియోజకవర్గంలో టిడిపి హుషారుగా ఉండగా వైసిపి ఓటమి నుంచి బయటికి రాలేకపోయింది. ఇక మిగతా పార్టీలు బిజెపి కాంగ్రెస్ పార్టీలు ఏ కార్యక్రమాలు లేక నాయకులకు పని లేకుండా పోయింది. ఆగస్టులో ఒంగోలులో జరుగనున్న రాష్ట్ర మహాసభలను అనంతరం సిపిఐ పార్టీ పుంజుకునే అవకాశాలున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

సీపీఐ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ఆగస్టు నెలలో జరుగు సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలను జయప్రదం చేయాలని, రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ మరియు, సీపీఐ బృందం పిలుపు నిచ్చారు. పెద్ద దోర్నాల మండల కేంద్రమైన దోర్నాలోని నటరాజ్ సెంటర్ నందు సీపీఐ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 28వ మహాసభల కరపత్రాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.శ్రీనివాస్, మాట్లాడుతూ ఆగస్టు నెలలో జరుగు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. గ్రామంలోని సీపీఐ నాయకులను, రైతు సంఘం నాయకులను,కార్మికులను కలుసుకున్నారు. వారి యోగ క్షేమలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఈ మహా సభల్లో పాల్గొనాలని ఆహ్వానం అందించారు.ప్రతి గ్రామం నుండి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలిన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, మండల కార్యదర్శి విశ్వరూప ఆచారి పూర్ణ కంటి తిరుమలయ్య, మరికొందరు నాయకులు కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ ...మోసం గ్యారంటీ

కుందూరు నాగార్జున రెడ్డి

విశాలాంధ్ర -కంభం : ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్క పథకం చెప్పినారంటే అదికచ్చితంగ అమలుచేయరనే గ్యారంటీ అని గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి కుందూరు నాగార్జున రెడ్డి విమర్శించారు .సోమవారం వైసీపీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాబు షూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో అయన మాట్లాడారు. జరిగిన 13 నెలల కాలంలో చంద్రబాబు ఆరు గ్యారంటీలలో ఏ ఒక్క పథకం పూర్తీ స్థాయిలో అమలు చేయలేదని తెలిపారు. మాజీ ముఖ్య మంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి వైసీపీ ఏడాదికి 40 వెల కోట్లు చొప్పున ఐదు నెలల కాలంలో 200ల కోట్లు ఖర్చు చేసి నిరుపేదలకు అవసర మైన పథకాలు అందించారని అన్నారు. అట్టడుగు వర్గాలవారికీ,అర్హత ఉన్న ప్రతి ఇంటికి పలు పథకాలు అందినాయని గుర్తుచేశారు. అమ్మవడి,విధ్యార్ధులకు ఫీజులు, ఆరోగ్యశ్రీ, నిరుపేదలకు సొంత ఇండ్లు, రైతులకు, ప్రజలందరికి పరిపాల సౌలభ్యం కొరకు సచివాలయాలు ,నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రజలకు పథకాల అమలుకు వాలంటరీవ్యవస్థ లాంటి పలు పథకాలు అందించారని గుర్తు చేసారు. ఎంపిపి చేగిరెడ్డి తులసమ్మ మాట్లాడుతూ చంద్రబాబు ఒకపథకం చేసి పది బహిరంగ సమావేశాలు పెట్టి ప్రజా ధనం వృధా చేస్తున్నారని ఆరోపించారు. జగన్ ప్రజాధనం వృదా కాకుండా ఒక చోట నుండి బటన్ నొక్కి పథకాల నిధులు అమలు చేశారన్నారు. వైసీపీ నాయకులు నెమిలిదిన్నె చెన్నారెడ్డి, గొంగడి చెన్నారెడ్డి, చిన్న కంభం సర్పంచ్ రసూల్, హజరత్ గూడెం సర్పంచ్ మహబూబ్ పీరా పలువురు వైసీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణాను అడ్డుకున్న అధికారులు

విశాలాంధ్ర - కనిగిరి : ప్రకాశం జిల్లాలోని తుంగోడు అడవి ప్రాంతంలో భారీగా కలపను అక్రమంగా తరలిస్తున్న లారీని కనిగిరి ఫారెస్ట్ శాఖ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఈ మేరకు కనిగిరి ఫారెస్ట్ ఆఫీసర్ ఉమామహేశ్వర్ రెడ్డి సిబ్బంది సహాయంతో నిర్వహించిన తనిఖీల్లో ఏపీ 04 వై 6786 నెంబర్ గల లారీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే, కనిగిరి నియోజకవర్గంలోని సిఎస్ పురం మండల పరిధిలోని తుంగోడు అడవిలో అనుమతులు లేకుండా వన సంపద అయిన కలపను లారీ ద్వారా తరలిస్తున్నట్టు సమాచారం అందిన నేపథ్యంలో, అధికారులు అక్కడికి చేరుకొని లారీని అడ్డుకున్నారు. లారీలో భారీగా కలప ఉన్నట్లు, అందులో పలు రకాల వృక్షాల కలప ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ లారీ ద్వారా ఎంత మొత్తంలో కలప తరలించబడుతుంది అన్న విషయాలపై ప్రస్తుతం అంచనా వేయబడుతోందని తెలిపారు. కలప విలువ, తరలింపు మార్గం, సంబంధిత నిందితుల వివరాలు తదితర అంశాలపై త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఫారెస్ట్ ఆఫీసర్ ఉమామహేశ్వర్ రెడ్డి తెలిపారు. అక్రమంగా అడవి వనసంపదను దోచుకునే ప్రయత్నాలను అరికట్టేందుకు విస్తృత చర్యలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

లిక్కర్ అమ్మి నగదును ప్రభుత్వమే తీసుకుంటుందని నఅన్నారు. నేడు ప్రవేట్ వ్యక్తులచే అధిక ధరలకు లిక్కర్ అమ్ముతూ, బెల్ట్ షాపులు నిర్వహిస్తే స్కామ్‌లు చేస్తున్నారని అన్నారు. ఇసుక, మట్టి, రేషన్ మాఫీయాకు ఇక తిరుగే లేదని అన్నారు. ప్రతి ఎన్నికలలో కల్ల బొల్లి మాటలు చెప్పి మోసం చేసే నాయకుడు చంద్రబాబు అని విమర్శించారు. 2014, 2024లలో కూడ అదే బాట పట్టారని అన్నారు. నేను సూపర్ సిక్స్ నెరవేర్చాను ఎవరైనా మాట్లాడితే వారికి నాలుక మందం అని సీఎం చంద్రబాబు అనటం దారుణమని అన్నారు. పిల్లలు అందరికి 15వేలు ఇస్తామని చెప్పి, మొదటి సంవత్సరం ఇవ్వక , రెండవ సంవత్సరం 20శాతం మాత్రం వారికి రూ. 13వేలు మాత్రమే అందించారని అన్నారు. గ్యాస్ పథకం కూడ ఇంత వరకు సక్రమంగా అమలు కావటం లేదని అన్నారు. ఉచిత బస్సుపై మాట తప్పుతూ కేవలం జిల్లాకు మాత్రమే పరిమితం చెయ్యాలని ఆలోచన చేయటం మోస పూరిత హామికి నిదర్శమన్నారు. ఉద్యోగాలు లేకుండా 20 లక్షల పైగా ఉన్న వారికి నిరుధ్యోగ భృతి కాని, ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు లేవని, 18 సంవత్సరాలు దాటిన మహిళలకు 18వేలు ఇచ్చే పథకం అడ్రస్ లేదని అన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ... 2014, 24లో కూటమిగా ఏర్పడి అలవి కాని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిందని అన్నారు. నేడు సంవత్సరం దాటినా సరే ఇచ్చిన హామీలు అమలు చెయ్యలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని అన్నారు. గెలిచిన ఆరు నెలలో మన జగనన్న ఇచ్చిన నవరత్నాలు హామీలు అమలు చేసారని గుర్తు చేసారు. కరోనాలో సైతం ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలు అన్ని అమలు పరచారని అన్నారు. నేడు రైతులతో సహా అన్ని వర్గాలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ స్కానర్‌ను ఆవిష్కరించారు. ప్రతి ఇంటికి బాబు చేసిన మోసం తీసుకువెళ్లాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు టీవీ సుబ్బా రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూధన రెడ్డి, ఐవీ సుబ్బా రెడ్డి, జిల్లా కోప్షన్ మెంబర్ ఆదామ్ ఫరీఫ్ (బుజ్జి), మాజీ ఎంపీపీలు గోళ్లపాటి మోషే, మాజీ జెడ్పీటీసీ ఎల్‌జీ వెంకటేశ్వర రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షులు పులి ప్రసాద్ రెడ్డి, ఆలోకం హరిబాబు, జిల్లా సర్పంచిల సంఘం ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనా రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు పులి ప్రసాద్ రెడ్డి, కుమ్మిత నాగి రెడ్డి, కుమ్మిత జయరామి రెడ్డి, యూత్, విద్యార్థి, రైతు విభాగం, కల్చర్, ఎస్సీ అధ్యక్షులు కొర్రపాటి శరత్, అశోక్, గువ్వల శ్రీనివాస రెడ్డి, పులి రమణా రెడ్డి, యామర్తి ప్రభుదాస్, సర్పంచిలు వలి, మందా శ్యామ్సన్, బి.వినాగి రెడ్డి, చిమటా సుబ్బా రావు, ఎం బ్రహ్మా రెడ్డి, ఎం.వెంకటేశ్వర రెడ్డి, ఎంపీటీసీలు ప్రభుదాస్, బాల కోటయ్య, మాజీ సర్పంచిలు పులి క్రిష్ణా రెడ్డి, వికాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ముందుగా జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లిని, జిల్లా చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పూల మాలతో సత్కరించారు.

పీజీఆర్ఎస్ అర్జీదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారుల సమస్యలపై, సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేసి, అర్జీదారులు సంతృప్తిచెందేలా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని మీకోసం సమావేశ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఎస్డిసీలు వర కుమార్, శ్రీధర్ రెడ్డి, జాన్సన్, పార్ధసారధి, కుమార్‌లు హాజరై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు.

వివాహానికి ముందు ఎదుర్కొనే సవాళ్లు, ఇతర సంబంధిత విషయాలపై మార్గదర్శకత్వం పొందేలా ఏర్పాటుచేసిన ప్రీ-మెరిటల్ కౌన్సెలింగ్ కేంద్రాల సేవలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ చిన ఓబులేసు, ఐసిడిఎస్ పిడి సువర్ణ, తదితర అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ సెంటర్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరు బస్టాండ్ సెంటర్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు బస్టాండ్ సెంటర్లో వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. డిపోలో బస్సు దిగంగానే రాత్రి వేళల్లో డిపోలో నుంచి బయటికి వచ్చేందుకు లైట్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. డిపో యాజమాన్యం ఈ సమస్యను పరిశీలించవలసిందిగా ప్రయాణీకులు కోరుతున్నారు. ఆర్టీసీ డిపోకు వెళ్లే ప్రయాణికులు బస్సు డిపోలో ఎక్కాలని ఆదేశాలు రావడంతో ప్రజలు డిపోకి వెళ్తున్నారు. కనుక ఇది గమనించి ఆర్టీసీ డిపోలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. పై అధికారులు స్పందించి ఏర్పాటు చేయవలసింది ప్రయాణికులు తెలుపుతున్నారు. టంగుటూరు ఆర్టీసీ డిపో అభివృద్ధికి ప్రజలు కూడా తమ సహాయ సహకారాలు అందించాలని యాజమాన్యం కోరుతుంది.

కెనరా బ్యాంకు ఏటీఎం ప్రారంభం

విశాలాంధ్ర-సి ఎస్ పురం : కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల లో త్వరలో కెనరా బ్యాంకు ఏటీఎం సేవలు ప్రారంభం అవుతాయి.కావున చుట్టూ పక్కల గ్రామ ప్రజలు డబ్బులు జమచేసుకోవచ్చును మరియు తీసు కోవచ్చునని కెనరా బ్యాంక్ మేనేజర్ తెలియజేశారు. కావున అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

4న భారీ బహిరంగ సభ

విశాలాంధ్ర - గిద్దలూరు : ఆగస్టు 4వ తేదీన గిద్దలూరు మార్కెట్ యార్డులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. కంభం గిద్దలూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌ల ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేసి ఆ రోజున ప్రమాణం స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంక్షేమ శాఖ మంత్రి డోల వీరాంజనేయులు తోపాటు రాష్ట్ర జిల్లా స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు అధికార ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, కంభం మార్కెట్ కమిటీ చైర్మన్ పూనూరు భూపాల్ రెడ్డి, గోడి ఓబుల్ రెడ్డి, టిడిపి నాయకులు మార్కెట్ కమిటీ కార్యాలయం పరిధిలో స్థలాన్ని పరిశీలించారు.

నేడు వైసీపీ సమావేశం

విశాలాంధ్ర - గిద్దలూరు : మంగళవారం వైసిపి సమావేశం నిర్వహిస్తున్నట్లు రాచర్ల మండల వైసిపి అధ్యక్షుడు రాష్ట్ర వైసిపి రైతు జాయింట్ సెక్రెటరీ ఏలేం మురళి తెలిపారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో నిర్వహించి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయకపోవటంపై తెలుపుతామన్నారు. ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు గిద్దలూరు వైసిపి ఇన్చార్జి కెపి నాగార్జున రెడ్డి వైసిపి ముఖ్య నాయకులు రాష్ట్ర జిల్లా మండల శాఖ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు ఎంపీటీసీలు ఎంపీపీ మాజీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యుత్ రంగాన్ని అదానికి అప్పగించే కుట్ర

- స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- ధర్నాలో కాంగ్రెస్ ఒంగోలు నియోజకవర్గ ఇంఛార్జ్ గౌస్

విశాలాంధ్ర-ఒంగోలు : విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేస్తూ రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని అదానీకి అప్పగించే కుట్ర చేస్తుందని, ఈ ప్రయత్నాలను వెంటనే ఆపకపోతే ప్రజా క్షేత్రంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బి.ఆర్ గౌస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ విధానాలకు నిరసనగా ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బి.ఆర్ గౌస్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి సోమవారం ఒంగోలులోని జిల్లా విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించి, ప్రధాన ద్వారం ముందు బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అదానితో చేసుకున్న సెకి ఒప్పందాన్ని రద్దుచేసి, స్మార్ట్ మీటర్ల విధానాన్ని అడ్డుకుంటామని, అదేవిధంగా గత ప్రభుత్వంలో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఈరోజు అవే ఒప్పందాలను అమలు చేస్తుందని, రాబోయే రోజుల్లో స్మార్ట్ మీటర్ల అమర్చిన తర్వాత స్లాబ్ సిస్టం యూనిట్ల లెక్కలో నుండి గంటల లెక్కలోకి మారుతుందని, స్వాతంత్రం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉన్న విద్యుత్ విధానాన్ని ఒక్కసారిగా మార్చివేసి, విద్యుత్ వాడిన అనంతరం చెల్లించవలసిన బిల్లులను విద్యుత్ వాడక మునుపే రీఛార్జి చేసుకొని విద్యుత్తు వినియోగించుకోవలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రౌఫ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దాసరి రవి, జిల్లా ఐఎన్టియుసి అధ్యక్షులు ఉంగరాల శ్రీనివాసరావు, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాయపాటి గిడియన్, యువజన కాంగ్రెస్ నాయకులు షేక్ అబ్దుల్ సుభాన్, గుత్తి రాజు, షేక్ ఇమామ్, కరీం బాషా, శంకర్ పాల్గొన్నారు.

కనిగిరి ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

విశాలాంధ్ర - కనిగిరి : వరల్డ్ హెపటైటిస్ డే సందర్భంగా సోమవారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో ఉచిత హెపటైటిస్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జననీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రజల ఆరోగ్య సంరక్షణే మా ప్రాధాన్యమని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండటమే మా ధ్యేయం అని పేర్కొన్నారు. ఈ శిబిరంలో మొత్తం 640 మందికి పరీక్షలు నిర్వహించగా, అందులో 3 గురికి హెపటైటిస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందన్నారు. వీరికి తక్షణమే అవసరమైన వైద్యాన్ని అందించేందుకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. హెపటైటిస్ వంటి వ్యాధులు తొందరగా గుర్తిస్తే మందుల వాడకంతో వ్యాధి తీవ్రతను తగ్గించుకుని ఆరోగ్యాకరమైన జీవితాన్ని గడపవచ్చనొలియజేశారు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ శిబిరంలో డిప్యూటీ డియంహెచ్ఓ డాక్టర్ సృజన, వైద్యాధికారి డాక్టర్ వెంకట ఫణి, మెడికల్ సిబ్బంది, ఎ ఎన్‌యం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నలూరు పోలీస్ స్టేషన్‌ను సీఐ తనిఖీ

విశాలాంధ్ర-పొన్నలూరు : స్థానిక పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి పొన్నలూరు పియస్ ను కొండేపి సీఐ సోమశేఖర్ సందర్శించి పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని,గదులను, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నారని... ఇలానే కొనసాగించాలన్నారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు, పట్టుబడిన ద్విచక్ర వాహనాలు మరియు ఇతర వస్తువులు తనిఖీ చేసి వాటిని త్వరగా డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేసారు. పోలీస్ స్టేషన్ లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే వారి నుండి ఫిర్యాదులు స్వీకరించాలని, వారితో మర్యాదగా, గౌరవంగా నడుచుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై వెంటనే త్వరితగతిన స్పందించి, ప్రాథమిక విచారణను వేగంగా నిర్వహించి బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదులో ఎలాంటి జాప్యం ఉండవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు,వారి విధుల వంటి వాటిపై ఆరాతీశారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. బీట్లు తిరిగే సమయంలో హిస్టరీ షీట్లు కలిగిన వారిని చెక్ చేయాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు.

'పల్లెనిద్ర'లో సీఐ భీమా నాయక్

విశాలాంధ్ర-సి ఎస్ పురం : మండలంలోని కోవిలంపాడు గ్రామంలో పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్ ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు గ్రామంలోని పలు ప్రాంతాలను సందర్శించి గ్రామస్తులతో మమేకమై పలు విషయాలను చర్చించారు ఈ సందర్భంగా సీఐ భీమా నాయక్ మాట్లాడుతూ గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించా రాత్రులు ఇంటి తాళాలు వేసేటప్పుడు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు ఆరుబయట నిద్రించకూడదని తద్వారా దొంగతనాలను నివారించవచ్చని వివరించారు అలాగే శుభకార్యాల్లో పాల్గొనేటప్పుడు బంగారు ఆభరణాలు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు సైబర్ నేరాల విషయంలో కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు గ్రామంలో నేరాల నివారణ, మహిళల భద్రత పై అవగాహన కల్పించారు ప్రజలందరూ శాంతి భద్రతల కోసం ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని, అదేవిధంగా గ్రామాలలో గంజాయి అమ్ముతున్న సేవించేవారు ఎవరైనా ఉంటే పోలీసులు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు అనుమానస్పదంగా కనిపించే వ్యక్తులపై వెంటనే సమాచారం అందించాలని ప్రజలను కోరారు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు.

భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : తమ భూములకు సంబంధించిన వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేయాలని మారెళ్ళ గ్రామానికి చెందిన విమల్ రాజ్ కుమార్ అరోరా తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని మారెళ్ళ గ్రామ రెవిన్యూ పరిధిలో సర్వే నంబర్ 231 లో 3ఎకరాల 69సెంట్లు భూమిని కొనుగోలు చేశాను, అందులో 2 ఎకరాల68 సెంట్లు భూమిని ఆన్ లైన్ చేశారని. మిగతా 1ఎకరా 1 సెంటు భూమిని ఆన్ లైన్ చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి తనను ఇబ్బంది పెడుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చాను తమరు జోక్యం చేసుకొని తనకు గల మూడు ఎకరాల 69 సెంట్లు భూమిని ఆన్ లైన్ చేయాలన్నారు. మరో రెండు అర్జీలు ప్రభుత్వ భూములకు డీకే పట్టా లు ఇవ్వాలని, మరో రెండు అర్జీలు రేషన్ కార్డులు కావాలని అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోమవారిపేట ప్రాథమిక పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మండలంలోని సోమవారిపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ - 2 సీవీ రమణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ మహిళలకు ప్రత్యేక కోట ఇవ్వాలి

విశాలాంధ్ర-గిద్దలూరు : రాజకీయంగా బీసీ బి మహిళలకు ప్రత్యేక కోట కేటాయించాలని కోరుతూ పోరుబాట నిర్వహిస్తున్నట్లు బిసి సమైక్య పోరు జనరల్ సెక్రెటరీ జాడీ శ్వేత అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సోమవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో బిసి మహిళలు నిర్వహించిన ధర్నా విజయవంతమైందని రాష్ట్ర బిసి జనరల్ సెక్రెటరీ జాడి శ్వేత అన్నారు. ఆమె మాట్లాడుతూ 33శాతం మహిళా రిజర్వేషన్ కోటాలో బి సి మహిళల కోటా ఎంత అని ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి తాము ఈ పోరాటం జరుపుతున్నామని తెలిపారు. మహిళలు రాజకీయాల్లో, ఉద్యోగాలలో, విద్యారంగంలో విశేషంగా రాణిస్తున్నారని, బిసి మహిళలు మరింత శక్తిమంతంగా మరింత చైతన్యంగా తయారు కావాలంటే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని 33శాతం ఉన్న మహిళా రిజర్వేషన్‌లో బిసిల కోటా ఎంతనో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి అధ్యక్షులు కేసన శంకర రావు, రాష్ట్ర మహిళా బిసి అధ్యక్షురాలు శ్రీమతి సంకారపు జయశ్రీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-ముండ్లమూరు : స్థానిక ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎన్ రాఘవయ్య, సిహెచ్ పద్మావతిలు వేట పాలెం మండలం, అద్దంకి మండలంకు బదిలీపై వెళ్లారు. వీరికి పాఠశాలలో సన్మానం నిర్వహించారు. ఎంఈఓలు ఎస్.కె కాలేశావలి(1) కే.వెంకటేశ్వర్లు(2) మాట్లాడుతూ ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేసి ఉత్తమ విద్యార్థులను మలచారని అన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు ఇరువురిని పూలమాలతో దుశ్శాలువతో సన్మానించారు. గ్రామ సేవకులు బొల్లెపల్లి హనుమంతరావు, బేత పూడి రామారావుల ఆధ్వర్యంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మేదరమెట్ల పెద్ద సోపారావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల స్థల దాత మేదరమెట్ల వెంకటేశ్వర్లు, రాజ్యం దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బేతపూడి లింగారావు, రజిని, ఎన్కే మస్తాన్వలి, పూర్ణచంద్రరావు, శైలజ, అంకమ్మ పాల్గొన్నారు.

దివీస్ ప్రాంగణ నియామకాలకు విశేష స్పందన

25 మందికి ఉద్యోగాలు

విశాలాంధ్ర-మార్కాపురం : స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ ప్రాంగణ నియామకాలకు విశేష స్పందన లభించిందని 156 మంది ఆశావహులు రెండు తెలుగు రాష్ట్రాల నుండి ఉదయం 09.30 గంటలకే శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ అన్నారు. నెల్లూరు, విజయవాడ, తిరుపతి, గుంటూరు, వినుకొండ, గిద్దలూరు, నంద్యాల, కర్నూలు, బేస్తవారిపేట, కంభం, ఒంగోలు, దోర్నాల నుండి ఈ నియామక ప్రక్రియకు హాజరు కావడం గొప్ప విషయమని బి.ఫార్మసీ, ఎం.ఎస్.సి, బి.యస్.సి, బి.టెక్, ఐటిఐ, పదవ తరగతి, ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన వారు ఈ జాబ్ డ్రైవ్లో పాల్గొనడం ఎంతో సంతోషించదగిన విషయమని ప్రిన్సిపల్ డా.కె.మధుసూదన్ అన్నారు. కళాశాల ప్రాంగణ నియామకాల విభాగం ఆధ్వర్యంలో రసాయన శాస్త్ర విభాగం పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఉద్యోగ నియామక ప్రక్రియకు భారీ స్పందన లభించడం పట్ల ప్రాంగణ నియామకాల విభాగం సమన్వయకర్త కె.పవన్కుమార్ మాట్లాడుతూ జాబ్ డ్రైవ్ విజయవంతం కావడంలో ప్రత్యేక పాత్ర పోషించిన రసాయనశాస్త్ర విభాగాధిపతి పి.శ్రీధర్, ఉపన్యాసకులు కె.సాయిలకు, తెలుగు ఉపన్యాసకులు డి.వినోద్, వ్యక్తిగత సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేసిన అధ్యాపక అధ్యాపకేతర మిత్రులకు, శ్రీసాధన డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రత్యేకమైన ధన్యవాదములు తెలిపారు. దివీస్ సంస్థ హెచ్.ఆర్ రిక్రూటర్ కె.రామకృష్ణ మాట్లాడుతూ వ్రాత పరీక్ష మరియు ముఖాముఖి ద్వారా 25 మందిని ఎంపిక చేయడం జరిగిందని పదవ తరగతి, ఇంటర్మీడియేట్, ఐటిఐ అర్హత కలిగిన వారికీ ప్రాంగణంలోనే నియామక పత్రాలు అందజేశామని మిగిలిన వారికి దివీస్ సంస్థ నుండి 40 రోజులలో నియామక ఉత్తర్వులు నేరుగా మెయిల్ ద్వారా గానీ లేక పోస్ట్ ద్వారా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపల్ పాటు సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ డి.రాజగోపాల్ రెడ్డి, ఎం.వి కృష్ణారెడ్డి, వి.ఆర్.కె ప్రసాద్, డా. వెన్నా కృష్ణారెడ్డి, జి.యల్ రమేష్బాబు, వైస్ ప్రిన్సిపల్ సి.శ్రీధర కుమార్, క్యాంపస్ అండ్ రిక్రూట్ మెంట్ ట్రైనింగ్ విభాగం సమన్వయకర్త కె. పవన్ కుమార్, పరిశోధన విభాగం సమన్వయకర్త డాక్టర్ యమ్ శేషుకుమార్, రసాయనిక శాస్త్ర విభాగాధిపతి పి.శ్రీధర్, ఉపన్యాసకులు కె.సాయి కుమార్, అకడమిక్ ఇన్చార్జ్ డాక పి.ఆర్.కె ప్రసాద్, బి.సి.డి.ఇ. సమన్వయకర్త యం.వి రాఘవేంద్ర, అధ్యాపకులు అభినందించారు. వివిధ విభాగాల ఉపన్యాసకులు టీ శ్రీకాంత్, పి.సి హెచ్ మధులి, జి.జె. రిషి షారోన్, జి.అనసూయ, డి.వినోద్ కార్యక్రమంలో సాంకేతిక సహకారం అందించారు.

నవోదయలో ఉత్తీర్ణత సాధించాలి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలోని కొమరోలు ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల విద్యాశాఖ అధికారి ఎండీ ఖాసిం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల పట్ల నమ్మకం కలిగే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని, ఆసక్తి గల విద్యార్థులను నవోదయ ఎంట్రన్స్ కొరకు తర్ఫీదు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, గ్రామంలో తమ పాఠశాల పరిధిలో డ్రాపౌట్స్ లేకుండా చూసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు బాలాజీ నాయక్, మల్లికార్జున మరియు సిఆర్పి హనుమ నాయక్‌కు తగు సూచనలు చేశారు.

స్వామిత్వ సర్వేపై శిక్షణ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్ల ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డి శ్రీదేవి ఆధ్వర్యంలో సోమవారం స్వామిత్వ సర్వేపై పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకుగ్రామ సర్వేలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండో విడతగా చిన్నారి కట్ల తువ్వపాడు, కాట్రగుంట మునగపాడు, పెదారికట్ల, సిద్ధవరం తలనూతల ఇరుసల గుండం, నాగంపల్లి వింజవర్తిపాడు గ్రామాల్లో ఈ స్వామిత్వ సర్వే నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు, మండల సర్వేయర్ రాజశేఖర్ పెదారికట్ల గ్రామ సర్వే రవితేజలు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు వీఆర్వోలు, ఇంజనీరింగ్ డిజిటల్, అసిస్టెంట్లు వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన

విశాలాంధ్ర -తాళ్లూరు: తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం డెంగ్యూ, విష జ్వరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం సోకిన వారికి వళ్లు నొప్పులు ఎక్కువగా వస్తాయని, నీరసంగా ఉంటుందని గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఫ్రైడే డ్రై డే పాటించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు వైఎస్ ఆర్‌కే ప్రసాద్, హెచ్‌ఈఓ చంద్రశేఖర్ బాబు, ఎఎన్ఎం ఎం.రమణమ్మ, హెచ్‌వి గోపినాయక్, ఆరోగ్య పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌కు మూడు అర్జీలు

విశాలాంధ్ర -తాళ్లూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు మూడు భూ సమస్యలపై వినతులు అందినట్లు తహసీల్దార్ బివి రమణా రావు తెలిపారు. పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామని బాధితులకు తెలిపారు.

శ్రీ దుర్గా సమేత చెన్న మల్లేశ్వర స్వామికి పూజలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని జమ్మలమడక గ్రామంలో శ్రీ దుర్గా సమేత చెన్న మల్లేశ్వర స్వామి శివాలయం రెండవ వార్షికోత్సవంలో జమ్మలమడక గ్రామానికి చెందిన వైయస్సార్ సిపి నియోజకవర్గ నాయకుడు కాపా రమణారెడ్డి, సుగుణమ్మ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం రెండవ వార్షికోత్సవం సందర్భంగా గ్రామానికి చేరుకున్న కాపా కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. హోమగుండం వద్ద వారు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు పొందూరు శ్రీరామ జనార్దన శర్మ, కలిగట్ల కృష్ణ ప్రసాదులు సుబ్రహ్మణ్యం స్వామి వారికి మహన్యాస పూర్వక, ఏకాదశి రుద్రాభిషేకం, అమ్మవారికి లలిత సహస్రనామాలతో కుంకుమార్చన, రుద్ర హోమాలు చేశారు. పీటలపై జమ్మలమడక హనుమంతరావు, రమాదేవి దంపతులు, బుచ్చి రామారావు శర్మ, అన్నపూర్ణ శాంతి దంపతులు పరివార దేవతలకు పంచామృతాభిషేకాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారిని గ్రామోత్సవం సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు అన్న దాన, ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుప్రక్కల పలు గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైనారు.

రాత్రి గస్తీ మరింత పటిష్ట చేయాలి

ఎస్పీ తుషార్‌డూడి

విశాలాంధ్ర -బాపట్ల : సాంకేతిక పరిజ్ఞానా న్ని అందిపుచ్చుకుంటూ అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి కోసం డ్రోన్‌లను వినియో గించుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలి పారు. సోమవారం స్థానిక ఎస్పి క్యాంప్ కార్యాలయంలోని సమావేశ హాలులో జిల్లాలోని సీఐ ఆ పై స్థాయి అధికారులతో అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశంను జిల్లా ఎస్పీ నిర్వహించి, గత ఆరు నెలల్లో నమోదైన కేసులు, పోలీసులు సాధించిన పురోగతి, సాధించవలసిన లక్ష్యాల గురించి పోలీస్ అధికారులకు దిశ నిర్దేశం చేసారు. అనంతరం గత ఆరు నెలల్లో అనేక విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను మరింతగా తగ్గించాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో మరింత చైత న్యం తీసుకురావాలన్నారు. రాత్రి సమయాలలో గస్తీ వ్యవస్థను మరింత పటిష్టపరిచి నేరల నియంత్రణ చేయాలన్నారు. ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌కి కావాల్సిన ఖచ్చితమైన సమాచారాలైన సిసిటిఎన్ఎస్ ఈ- సాక్షి, ఈ- సమన్స్ వంటివి ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఖైదీలను కూడా అవకాశం ఉన్నంతవరకు కోర్టులో వర్చువల్ విధానంలో హాజరుపరచడం వలన సమయము, శ్రమ తగ్గుతుందని తెలిపారు. అధికారులు మరింత కష్టపడి ప్రజలకు మెరుగైన సేవలందించినప్పుడే యూనిఫామ్ యొక్క విలువ పెరుగుతుందన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని, కేసులు కట్టినప్పటికీ తమ ప్రవర్తన మార్చుకొని వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది పురస్కారం

మొదటి త్రైమాసికంలో లోక్ అదాలత్ లో ఏకువ కేసులను పరిష్కారం చేసిన అద్దంకి సీఐ సుబ్బరాజు, రెండవ త్రైమాసికంలో లోక్ అదాలత్ లో ఏకువ కేసులను పరిష్కారం చేసిన బాపట్ల పట్టణ ఇన్స్పెక్టర్ ఆర్.రాంబాబు ను, దొంగతనాల కేసుల్లో ప్రాపర్టీ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రేపల్లె పట్టణ ఇన్స్పెక్టర్ ఏ మల్లికార్జున రావు, మార్టూరు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శేషగిరిరావు, చీరాల వన్ టౌన్ ఇనిస్పెక్టర్ ఎస్ సుబ్బారావు, వేమూరు సీఐ పి.ఆంజనేయులు, రేపల్లె రూరల్ సీఐ ఆర్ సురేష్ బాబులకు ప్రశంస పత్రాలు అందజేశారు. అంతేకాకుండా గత ఆరు నెలల్లో కోర్టు కానిస్టేబుల్‌గా ఉత్తమ ప్రతిభ కనబరిచి నేరస్థులకు శిక్షలు పడటానికి కృషిచేసిన మార్టూరు కానిస్టేబుల్ కిరణ్, బాపట్ల రూరల్ కానిస్టేబుల్ శివయ్య, చిన్న గంజాం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, రేపల్లె పట్టణ కానిస్టేబుల్ కరీముల్ల, బల్లికురవ కానిస్టేబుల్ నాగార్జునలను జిల్లా ఎస్పీ అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

విశాలాంధ్ర - అద్దంకి : బాపట్ల జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి జుబేర్ సోమవారం స్థానిక ప్రకాశం ప్రభు త్వ జూనియర్ కళాశాలను ఆకస్మి కంగా తనిఖీ నిర్వహించారు. కళా శాలలో విద్యార్థులకు వసతులు బోధన, మధ్యాహ్నం భోజనం తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వ హించారు. ఈ సంవత్సరం కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలన్నారు. బోర్డు ప్రణాళిక ప్రకారం విద్యాబోధన నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారి నేత్రదానం

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకిలోని ప్రముఖ కూరగాయల వ్యాపారి మారం మల్లయ్య (80) సోమవారం మృతి చెందగా వారి కుటుంబ సభ్యుల ను రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ చుండూరి మురళీ సుధాకర్‌రావు ప్రోత్స హించి పెదకాకాని శంకర నేత్రాలయం వారికి తెలియ జేశారు. హస్పిటల్ వైద్యులు శ్రద్ధా బృందం వచ్చి మృతిని కార్నియాలు సేకరించి శంకర నేత్రాలయానికి తరలించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి అలహరి హరిప్రసాద్, పూర్వ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, రోటరీ సభ్యులు చిన్ని మురళీకృష్ణ, మహమ్మద్ రఫీ, అంజాద్ భాష పాల్గొన్నారు.

డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి ఆర్టీసీ డిపోలో ఆన్ కాల్ డ్రైవర్‌గా పనిచేయుటకు దరఖాస్తులు చేసుకోవాలని డిపో మేనేజర్ రామ మోహన్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి పాస్ అయి ఉండి హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి 18 నెలలు హెవీ వెహికల్ మీద అను భవం కలిగి ఉండాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలన్నారు. వివరాలకు డిపో అధికారులను సంప్రదించాలన్నారు.

లింకు రోడ్ల సర్వే పూర్తి చేయాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : మండల పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభాని హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని లింకు రోడ్లకు సంబంధించిన సర్వే ఈ వారంలో పూర్తి చేయాలన్నారు. అన్ని గ్రామాల్లోని ఎస్టీలకు కూడా హౌసింగ్ సర్వే గురువారం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలలో శానిటేషన్, ఎస్ డబ్ల్యు పిసి షెడ్యూల్ల పనితీరు గురించి అడిగి తెలుసు కు న్నారు. గ్రామాల్లో ప్రతి 15 రోజులకు ఓసారి తాగు నీటిని పరీక్షలు నిర్వహించాలని తెలియజేశారు.

బసవయ్యకు డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర - సంతమాగులూరు : మక్కెన వారిపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానో పాధ్యాయుడు బ్రహ్మశ్రీ చెన్నుపల్లి బసవయ్యకు కర్ణాటకలోని తెలుగు సాంస్కృతిక సాహితీ ట్రస్టు వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సింగరకొండ ప్రసన్నాంజనేయ విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం కమిటీ, సంతమాగులూరు, బల్లి కురవ మండలాల్లోని ఉన్న సేవా సంఘాల ప్రతి నిధులు గుంటుపల్లి రామకృష్ణ, సభ్యులు బసవ య్యను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్య త్తులోనూ తన సేవానిరతిని కొనసాగిస్తూ.. ఇలాంటి ఘనతలు ఎన్నో సాధించాలని అభిలషించారు.

పొగాకు కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ తనిఖీ

విశాలాంధ్ర - జె.పంగులూరు : అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జె పంగులూరు తహసీల్దార్ పోపూరి సింగారావు తనిఖీ నిర్వహించారు. పొగాకు కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరుగుతుందని సోమవారం ఆయా గ్రామాల రైతులు 761 క్వింటాళ్ల పొగాకు తీసుకురాగా మధ్యాహ్నానికి 400 క్వింటాళ్ల పొగాకు కొనుగోలు జరి గిందన్నారు. అలాగే మంగళవారానికి 765 బేళ్లు కొనుగోలు కేంద్రానికి తెచ్చుకోవడానికి రైతులకు అనుమతులు ఇచ్చారని సొసైటీ

సెక్రెటరీ రావూరి లక్ష్మి, బయ్యర్ మరెళ్ల శ్రీధర్ బాబు తెలిపారని తహసీల్దార్ సింగారావు అన్నారు. రైతులు తేమ సరిచూసుకొని పొగాకు తీసుకురావాలని కొనుగోలు సిబ్బంది సొసైటీ సభ్యులు రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కొనుగోలు జరపాలని ఆదేశించారు.

పచ్చిరొట్ట విత్తనాల వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర - సంతమాగులూరు : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో భాగంగా పొలాల్లో పంట సాగుకు ముందుగా పచ్చిరొట్ట విత్తనాలు చల్లడం ద్వారా భూమి సారవంతంగా మారుతుంది. ఈ పద్ధతులను నేను స్వయంగా నా పొలంలో అమలు చేసి, మా గ్రామ రైతులకు అవగాహన కల్పిస్తానని పాతమాగులూరు సర్పంచ్ జిర్రా విజయబాబు చెప్పారు. సోమవారం ప్రకృతి వ్యవసాయ విభాగంలోని సంతమాగులూరు యూనిట్ సిబ్బంది షేక్.నాగూర్ వలి, షేక్. కాలేషావలి ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాలు వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సర్పంచ్ విజయబాబు తన నాలుగు ఎకరాల భూమిలో వేసేందుకు 18 రకా ల విత్తనాలను తీసుకున్నారు. తొలుత గోమూ త్రం, పేడతో తయారు చేసిన జీవా మృతంతో విత్తన శుద్ధి చేసి పొలంలో వెదజల్లా రు. మొక్కలు ఏపుగా పెరిగిన తర్వాత రోటో వేటర్ తో భూమిలో దుక్కి చేయించాలని, తద్వారా నేలలు సారవంతంగా మారతాయని చెప్పారు.

రామానుజాచార్యులు 108 దివ్య నామాలు

విశాలాంధ్ర -చీమకుర్తి : చిన్న తిరుమలగా పేరొందిన చీమకుర్తి మండలంలోని అగ్రహారం గ్రామంలో వేయించి ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీమతి రామానుజాయ నమః 108 దివ్య దేశములు నడుమ చిన్న తిరుమల ప్రసన్న వెంకటేశ్వర మంగళకరమైన సౌందర్య రూపంలో చేర్చి చక్కని ఫోటో చేయించి ఆలయా నికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో అర్చక స్వామి రామానుజాచార్యులు, చలువాది బదరీ నారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నల్ల బర్లీ రైతులకు సూచనలు,సలహాలు

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని తనుబొద్దివారి పాలెం, చిమటావారిపాలెం గ్రామంలో వ్యవ సాయ శాఖ అధికారి ఎస్ వి పి కుమారి నల్లబర్లీ రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. పొగాకు గ్రేడింగ్ చేస్తున్న రైతులు గ్రేడింగ్ చేసేటపుడు పంపు గుల్లాకు , నలుపు, పచ్చ ఆకుతీసి ఏ రెలుపుకు, ఆ రెలుపు బేల్స్ కట్టుకో వాలన్నారు. తేమశాతం 20 కన్నా తక్కువ ఉండాలన్నారు. తేమ ఎక్కువ ఉంటే చెక్కులు తిరస్కరిస్తారని ఈ కార్యక్ర మంలో ఏ ఈ ఓ మధుప్రియ, వి ఏ ఏ నవీన్ , రైతులు గుండు గోపికృష్ణ, గుండు వీరశంకర్ పాల్గొన్నారు.

కృష్ణ మృతికి సంతాపం

విశాలాంధ్ర - సంతమాగులూరు : పాతమాగులూరుకు చెందిన ఎస్టీ కుల హక్కుల పోరాట సమితి సంతమా గులూరు మండలం నాయకులు తలపు ల కృష్ణ (56) సోమవారం గుండెపోటుతో అకాల మృతి చెందారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న మండల ఎంపీపీ ఎనుబర్ల యల్లమంద, గ్రామ సర్పంచ్ జిర్రా విజయబాబు, సంఘ నాయకులు కృష్ణ పార్థీవ దేహాన్ని సందర్శించారు. ఈసందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన మృతి ఎస్టీ కుల పోరాట సమితికి తీరని లోటు అని పలువురు సంఘ నేతలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

నేడు సహకార సంఘం పాలకమండలి ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని జాగర్లమూడి వారిపాలెం వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలక మండలికి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన అల్లంనేని బ్రహ్మానంద స్వామి, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం మంగళవారం ఉదయం 7 గంటలకు ముప్పవరం గ్రామంలోని సహకార సంఘం కార్యాలయంలో జరగనుందని ముప్పవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు గరిమిడి జగన్మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా సొసైటీ పరిధిలోని అన్ని గ్రామాల తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, రైతులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com మంగళవారం 29 । జులై । 2025

పౌష్టికాహారంతోనే పిల్లల ఆరోగ్యం

విశాలాంధ్ర - రేపల్లె : పౌష్టికాహారంతోనే పిల్లల శారీరక, మానసిక, ఎదుగుదలకు, దోహదపడతాయని అంగన్‌వాడీ సెంటర్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. సోమవారం స్థానిక రేపల్లె మండలం లోని చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామ బాలల రక్షణ కమిటీ, బాలల పంచాయతీ అధ్యక్షతన చోడాయిపాలెం, బొబ్బర్లంక, పెనుమూడి, విశ్వేశ్వరం, పిరాట్లంక, తుమ్మల, కారుమూరు, నల్లూరిపాలెం అను బాలల స్నేహ గ్రామాలలో న్యూట్రి కిచెన్ గార్డెన్ విత్తనాలను ఆయా గ్రామ అంగన్వాడి వర్కర్లకు, ఆ గ్రామ బాలల రక్షణ కమిటీ సభ్యులు అంగన్వాడి టీచర్లు, స్కూల్ టీచర్లు, సర్పంచులు చేతుల మీదుగా మొత్తం 14 రకాల విత్తనాలను సరఫరా చేయడం జరిగింది. విశ్వేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిడిఓ కిషోర్ మాట్లాడుతూ కిచెన్ గార్డెన్ న్యూట్రిషన్ కార్యక్రమం చేయటం ఎంతో శ్రద్ధతీసుకోవాల్సినటువంటి పని అని దీని ద్వారా ఫలితం దానికి డబల్ రెట్టింపు ఉంటుందని తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఇవ్వటం మరీ ముఖ్యంగా అంగన్వాడి పిల్లలకి ఇవ్వటం ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ ట్రస్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ యన్ శ్రీనివాస్‌రావు గ్రామ పెద్దలు, బాలలు రక్షణ కమిటీ సభ్యులు, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ ట్రస్ట్ కో-ఆర్డినేటర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

విశాలాంధ్ర - వేటపాలెం : రోటరీ క్లబ్‌ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో సామూహిక సీమంతాల కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ టీ.ఝాన్సీ పాల్గొని మాట్లాడుతూ గర్భిణీలు వైద్యుల సలహాల మేరకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడంతో పాటు ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం తీసుకోవాలని, మానసిక ప్రశాంతతతో ఉండాలని, బాలింతలు ఆరు నెలల పాటు బిడ్డలకు తల్లిపాలు అందజేయాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ ఏవీ. సురేష్ బాబు, సెక్రటరీ అక్కల చంద్రశేఖర్ రెడ్డి, బట్ట మోహనరావు, కె. శివరామకృష్ణ, ఊట్ల వెంకటేశ్వర్లు, పోలకం చంద్రశేఖర్, సభ్యులు, ఐసీడీఎస్ సూపర్వైజర్ సజ్జా పుష్పవల్లి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

రేడియో అండ్ టీవీ టెక్నీషియన్స్ సహకార సంఘ అధ్యక్షునిగా వెంకట్రావు

విశాలాంధ్ర - రేపల్లె : విజయవాడలోని భార్గవ కంప్యూటర్ సెంటర్ హాల్లో రాష్ట్ర రేడియో అండ్ టీవీ టెక్నీషియన్స్ సహకార సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రేపల్లె పట్టణానికి చెందిన సీనియర్ టీవీ టెక్నీషియన్ అధ్యక్షులుగా దార్ల వెంకట్రావును, తుని పట్టణంకు చెందిన గానిశెట్టి రామకృష్ణని ఉపాధ్యక్షులుగా, తణుకుకు చెందిన సీనియర్ టెక్నీషియన్ గుడాల శ్రీనివాస్‌ని ట్రెజరర్‌గా, అనంతపురం కు చెందిన సీనియర్ టెక్నీషియన్ కోడె సాయిబాబుని సెక్రటరీ, తణుకుకు చెందిన నాగుని జాయింట్ సెక్రటరీగా, ఎన్నుకోవడం జరిగింది. అనంతరం రాష్ట్రంలోని టెక్నీషియన్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార మార్గాలు గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

ఘనంగా నవీన్‌కు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సాయి తేజ కన్‌స్ట్రక్షన్స్ అధినేత, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి గంటా నవీన్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయనకు సన్నిహితులు, శ్రేయోభిలాషులు, వ్యాపార భాగస్వాములు సాయి తేజ కన్‌స్ట్రక్షన్స్ సిబ్బంది తరఫున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. గంటా నవీన్ రియల్ ఎస్టేట్ రంగంలో తనదైన ముద్ర వేసి, బాపట్ల ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. ఆయన స్థాపించిన సాయి తేజ కన్‌స్ట్రక్షన్స్ నాణ్యత, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచి పలు కుటుంబాలకు ఆశ్రయాన్ని అందిస్తున్నారు. నిబద్ధత, దార్శనికతతో కూడిన ఆయన నాయకత్వం ఎంతోమందికి ఆదర్శప్రాయంగా ఉన్నారు. పలువురు ప్రముఖులు నవీన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి పూలబొకేలు, దృశాలువాలు స్వీట్లతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సచివాలయాల సిబ్బంది బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఏల్చూరులోని సచివాలయం-1,2,3లకు నూతనంగా వచ్చిన సిబ్బంది సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా పాత, కొత్త సిబ్బందితో పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్ అధ్యక్షతన పరిచయ సమావేశం నిర్వహించారు. మండల టీడీపీ నేత దుద్దేల చిన్న గాలెయ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, బాధ్యతాయుతంగా పనిచేసి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. వీఆర్వో రామబ్రహ్మం మాట్లాడుతూ.. మండల అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ.. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పూర్ణచంద్ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన సచివాలయం సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

స్వామిత్వ సర్వే శిక్షణ

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండలంలో స్వామిత్వ సర్వే గ్రామాలు బుక్కాపురం, మోపాడు, ఇన్నిమెర్ల, మోటరావులపాడు, నాసికా త్రయంబకం, పామూరు, రావిగుంటపల్లి, సిద్ధవరం, బలిజపాలెం రెవెన్యూ గ్రామాలు ఎంపికైనందున ఆ గ్రామాల పరిధిలోనీ పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, విఆర్వోలకు, సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమం మొదటి రోజు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో సోమవారం ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి, సుందర రామయ్య డిప్యూటీ ఎంపీడీవో కె కోదండరామయ్య పాల్గొన్నారు.

బాపట్ల ఖ్యాతిని పెంచిన శ్యామ్

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంటా అంజిబాబు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : విశ్రాంత జాతీయ క్రీడాకారుడు శ్యామ్ బాపట్ల ఖ్యాతిని పెంచారని కాంగ్రెస్ పార్టీ నాయకులు గంటా అంజిబాబు తెలిపారు. సోమవారం శ్యామ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్ ద్వారా నిరుపేదలకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా బాపట్ల క్రీడాకారుల తరఫున, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ క్రీడాకారులు గంటా అంజిబాబు నేతృత్వంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులకు చేయూతనిస్తూ ఆర్థిక శాఖ అందజేశారు. అలాగే శ్యామ్ పేరిట బాపట్ల అన్న క్యాంటీన్ నందు మూడు పూట్ల అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. శ్యామ్ క్రీడా రంగంలోనే కాక, పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించి ప్రతి సంవత్సరం నిరుపేద క్రీడాకారులకు క్రీడ కిట్లను, విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలను, నోట్ బుక్స్‌ను పంపిణీ చేసేవారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంటా రాములు, కాంగ్రెస్ నాయకులు దోనేపూడి దేవరాజ్, డీలర్ ఆంజనేయులు, గిద్ది శ్రీనివాసరావు, బక్క రోశయ్య, ఎస్.కె బాజీ, గంట చిన్న, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



విశాలాంధ్ర -బాపట్ల : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని 6,7,8, వార్డుల్లో సోమవారం బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కోన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. హామీలను అమలు చేసి అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, చేజర్ల నారాయణరెడ్డి, సయ్యద్‌పీర్, పాపారావు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, తెనాలి వారి తరుపున బ్రాంచ్ మేనేజర్ గారి సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియచేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని బాపట్లజిల్లా, నగరం(మం), అద్దంకివారి పాలెం గ్రామ కాపురస్తులు 1)బొర్రు వీర గోపి మరియు 2)బూరా శిరీష గారలు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని లేటు యరగళ్ల వెంకటేశ్వర రావు గారి భార్య 1) కాళికాంబ, కుమారుడు వీరబాబు గార్ల వద్ద నుండి ది.14-07-2025న కొనుగోలు నిమిత్తం విక్రయ అగ్రిమెంటు కుదుర్చుకొని అట్టి ఆస్తిపై ఋణంకొరకు నా క్లయింటును సంప్రదించినారు. దిగువ షెడ్యూలు ఆస్తి యరగళ్ల వెంకటేశ్వర రావు గారు ది.31-03-2005న విక్రయ దస్తావేజు నెం. 213/2005 యస్.ఆర్.ఓ. చెరుకుపల్లి ద్వారా కొనుగోలుచేసి సర్వ హక్కులతో అనుభవించుచూ మరణించిన దరిమిలా ఆయన వారసులైన 1)యరగళ్ల కాళికాంబ, 2) యరగళ్ల వీరబాబు గార్లకు సంక్రమించి వారు సర్వ హక్కులతో అనుభవించుచ్చు ఆస్తిని బొర్రు వీరగోపి గారు కొనుగోలు నిమిత్తం విక్రయ ఖరారు పడియున్నారు. కావున షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, కోర్టు జప్తులు, తనఖాలు, ఇతర క్లయిములు వగైరాలు వున్నయెడల నాకుగాని, నా క్లయింటుకు గాని ఈ ప్రకటన వెలువడిన తేది నుండి వారం రోజులు లోగా లిఖిత పూర్వకంగా వ్రాతపూర్వకమైన ఆధారాలతో క్రింద చిరునామాలో సంప్రదించవలెను. గడువు తదుపరి వచ్చిన అభ్యంతరములు వగైరాలు నాక్లయింటు హక్కులను మరియు షెడ్యూలుఆస్తిని బైండుచేయజాలవు.

షెడ్యూలు:బాపట్ల డి॥, భట్టిప్రోలు సబ్ డి॥ యిలాకా, భట్టిప్రోలు మండలం, ఐలవరం గ్రామ పంచాయితీ ఏరియాకు చెందినటువంటిన్నీ "అద్దేపల్లి గ్రామ డి.నెం.645/2.రు య.0.82ట్లలోనిదైయుండి పాత డోర్ నెం.3-9/1.రుకు సరియగు కొత్త డోర్ నెం.2-55రు. అసిస్మెంటు నెం.205రు లో చ.గ.653.40లు స్థిరాస్తి ఖాళీ నివేశనా స్థలము అందులోని ఆర్.సి.సి.శ్లాబు కప్పు డాబా ఇల్లు వగైరాలతో సహా వున్న ఆస్తికి **హద్దులు.తూర్పు:** అత్తలూరి మురళీకృష్ణారావు గారి స్థలం హద్దు, **దక్షిణం:**హైవేస్ రోడ్డు హద్దు, **పడమర:**అత్తలూరి రంగారావు గారి స్థలం హద్దు, **ఉత్తరం:** పోరంబోకు డొంక హద్దు.

కె. హరికృష్ణ, అడ్వకేట్,
డోర్.నెం. 22-7-15, కొత్తపేట, తెనాలి. సెల్ : 9440751659

పీడీసీసీ చైర్మన్‌ని కలిసిన సుధాకర్ రెడ్డి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పిడిసిసి చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను సోమవారం పెద్ద దోర్నాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి చైర్మన్ బట్టు సుధాకర్ రెడ్డి,ఒంగోలు లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రైతులకు పిఎసిఎస్ నుండి రుణాలను కల్పించి,మా పశ్చిమ ప్రాంత వెనుకబడిన ప్రాంతం రైతులకి ఎక్కువ రుణాలను కల్పించాలని ఆయనను కోరారు..ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు కడిమేట్ల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

గర్భిణీలకు పోషకాహార వస్తువులు పంపిణీ

విశాలాంధ్ర -చీమకుర్తి : రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో చీమకుర్తిలోని దిన్నెపురంలోని అంగన్వాడీ కేంద్రంలో ఆరుగురు గర్భిణీలకు పోషకాహార విలువలు కలిగిన పాకెట్లు ను మరియు తాజా పండ్లను, చీరా,సారాల తో సత్కరించారు రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షులు తొగటి శ్రీను, కార్యదర్శి పారిశ్ల శ్రీనివాసరావు, అధ్యక్షులు తొగటి శ్రీను మాట్లాడుతూ ప్రస్తుతం ఆరుగురు గర్భిణీలు పండంటి బిడ్డకు జన్మ నివ్వాలని, వారు క్షేమంగా, ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు పోకూరి రామకృష్ణారెడ్డి, కడవా రామకృష్ణారెడ్డి, గుండా చిన్న వెంకటేశ్వర్లు, మాజీ కార్యదర్శులు అంబటి వీరారెడ్డి, ముప్పూరి చలమయ్య, కందుకూరు వెంకట సురేష్, యడ్లపల్లి సురేష్, రోటరీ క్లబ్ సభ్యులు నాగళ్ళ సత్యం,పిల్లి వీరనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని నేరేడుపల్లి గ్రామ పొలాల్లో రహస్యంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు పీసీపల్లి ఎస్ఐ జి కోటయ్య తెలిపారు. రాబడిన సమాచారం మేరకు సోమవారం నేరేడుపల్లి గ్రామ పొలాల్లో రహస్యంగా పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో ఆరుగురిని పట్టుకొని వారి దగ్గరి నుంచి రూ 5150 లు స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలియజేశారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తమ కంటపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్సై తెలియజేశారు.

పువ్వాడి వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-పామూరు : మాజీ మండల టీడీపీ అధ్యక్షులు పువ్వాడి రాధాకృష్ణ 12వ వర్ధంతి వేడుకలను సోమవారం స్థానిక శేషమహల్ హాల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాధాకృష్ణ సేవలను పొగుడుతూ టిడిపి నేతలు నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలోసింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, టిడిపి వివిధ ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, టిడిపి పట్టణ అధ్యక్షులు, సయ్యద్ అమీర్ బాబు, తెలుగు యువత అధ్యక్షులు మెంటా నరసింహారావు, దేవరపు మాల్యాద్రి, వైద్యశాల డైరెక్టర్ నర్సింగ్ సాంబయ్య, మీబీనా మౌలాలి, గుంటుపల్లి శీను, బిల్డర్ పువ్వాడి వెంకటేశ్వర్లు, ఖజా రహమతుల్లా, హాజీ గౌస్, నాయబ్ రసూల్, బండ్ల నారాయణ, శేషం మోసే,టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని పరిరక్షించుకునేందుకు ఉద్యమిద్దాం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

విశాలాంధ్ర -చీమకుర్తి : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని పరిరక్షించుకునేందుకు గ్రామీణ పేదలు ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపు నిచ్చారు. పట్టణంలోని పంగులూరి కృష్ణయ్య భవన్‌లో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘాల మండల మహాసభ జరిగింది. ఈ సభకు ఎస్ ఆదినారాయణ,తన్నీరు సుజాత అధ్య క్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లా డుతూ పేదరిక నిర్మూలన వలసల నివారణ గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి దోహదపడే విధంగా ఉపాధి హామీ చట్టాన్ని యూపీఏ ప్రభుత్వం 2005లో తెచ్చిందని తెలిపారు. ఈ చట్టం వచ్చాక గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు కొంత మెరుగయ్యాయని కొంత కొనుగోలు శక్తి పెరిగిందని అన్నారు. స్త్రీ పురుషులకు సమాన వేతనం వందరోజుల పని గ్యారంటీ పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి లాంటి అనే అంశాలు చట్టంలో ఉన్నాయని తెలిపారు. కేంద్ర బడ్జెట్ లో 2.5 లక్షల కోట్లు ఉపాధి హామీకి కేటాయించాలని కోరుతుంటే కేవలం 76 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. రెండు వారాలకు ఒకసారి వేతనాలు ఇవ్వాలని చట్టంలో ఉన్న 14 రోజులైనా ఇంకా బిల్లులు విడుదల చేయలేక తద్వారా కూలీలు పనికి దూరమయ్యేలా ప్రభుత్వం వ్యవహరి స్తుందన్నారు. ఆగస్టు 12,13 తేదీల్లో కనిగిరిలో జిల్లా మహాసభల్లో ప్రణా ళిక రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, సి.ఐ.టి.యు.మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, కె.వి.పి.ఎస్.నాయకులు తొట్టెంపూడి రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు, గంగుల చెన్న కేశవులు, రావూరి వెంకట్రావు, కుంచాల చలపతిరావు,బొంత భాస్కర్, జే.ఏలమంద,దమ్మాల వెంకటరావు,నాగమణి,ఎం. అంజ య్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురికి జైలు

విశాలాంధ్ర - కర్లపాలెం : కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి క్రయ విక్రయాలకు పాల్పడిన ముగ్గురు ముద్దాయిలకు 4 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ గుంటూరు కోర్టు తీర్పు వెలువరించింది. వివరాల్లో కెళితే కర్లపాలెం గ్రామంలోని రాజీవ్ నగర్ రోడ్డులోని మత్స్య మార్కెట్ సమీపంలో ఒక ఇంటిలో దాసరి శ్రీనివాసరావు, తోకల పిచ్చయ్య(మృతి) అను ముద్దాయిలు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో 2014 సంవత్సరం డిసెంబర్ 30న అప్పటి బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.మల్లికార్జునరావు, కర్లపాలెం పోలీస్ సిబ్బంది ముద్దాయిలను అరెస్ట్ చేశారు. ముద్దాయిలు ఇచ్చిన సమాచారం ఆధారంగా గంజాయి సరఫరా చేస్తున్న తూర్పు గోదావరి జిల్లా ఏలూరు పట్టణానికి చెందిన గాలం పాపారావు, విశాఖపట్నం జిల్లా రోల్లగుంట మండలం చెన్నగోపాలపట్నం గ్రామంకు చెందిన పోతురాజు అప్పలనాయుడులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. వీరి నుండి భారీ మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగింది. గుంటూరు ప్రథమ అదనపు జిల్లా న్యాయస్థానంలో కేసు విచారణకు రావడంతో జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ, కర్లపాలెం ఎస్సై రవీంద్రలు కేసు ట్రైలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ, సరైన రీతిలో సాక్ష్యం చెప్పే విధంగా సాక్షులకు తర్ఫీదు ఇవ్వగా కోర్టు విధులు నిర్వహించిన కానిస్టేబుల్ కె.శివాజీ సాక్షులను సకాలంలో కోర్టు వారి ఎదుట హాజరు పరచగా ఏపీపీ బి.కోటేశ్వరరావు సరైన రీతిలో వాదనలు వినిపించినారు. కేసు దర్యాప్తు, సాక్షుల వాంగ్మూలం, పోలీస్ అధికారులు సేకరించిన భౌతిక సాక్షాధారాలు, నిపుణుల నివేదికల ఆధారంగా నాలుగేళ్ళ శిక్ష రూ.10,000 నగదు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణపై పోలీస్ శాఖ శూన్య సహన విధానం పాటిస్తున్నదన్నారు. యువత భవిష్యత్‌ను దెబ్బతీసే గంజాయి ఇతర మత్తు పదార్థాలను ఎవరైనా కలిగి ఉన్న రవాణా, విక్రయాలకు పాల్పడిన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గతంలో గంజాయి కేసులలో పట్టుబడిన వారు, వారి ప్రవర్తనను మార్చుకోకుంటే పీడీ చట్టం ప్రయోగించడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. కర్లపాలెం గంజాయి కేసులోని ముద్దాయిలకు జైలు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకున్న పోలీస్ అధికారులను, కోర్టు విధులు నిర్వహించే సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

విద్యార్థులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పై శిక్షణ



విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి భాష్యం స్కూల్లో సీఐ సుబ్బారావు ఎస్ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో స్టూడెంట్స్ కి డ్రంక్ అండ్ డ్రైవ్ అండ్ డ్రగ్స్ ఉమెన్ అరాస్మెంట్ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. సిఐ సుబ్బా రావు మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ చాలా ముఖ్యమైందని ఈ దశలో విద్యా ర్థులు ఏ విధంగా నడుచుకోవాలో,ఏ విధంగా నడుచు కోకూడదో, వివరించారు. డ్రగ్స్ పట్ల మరియు ఉమెన్ టీచింగ్ మీద, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం వాటి మీద స్టూడెంట్స్ కి అవగాహన కల్పించారు. ఎస్సై కృష్ణయ్య మాట్లాడుతూ పిల్లలు ఇంట్లో మొబైల్ యాప్ డౌన్లోడ్ చేయటం వల్ల సెల్ఫోన్లోకి వచ్చే ఓటీపీలు గురించి సైబర్ క్రైమ్స్ గురించి,విమెన్ టీజింగ్ గురించి తెలిపారు. భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ జయకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి అవేర్నెస్ ప్రోగ్రామ్స్ విద్యార్థిని విద్యార్థులకు ఎంతో సహాయపడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని సహకరించిన భాష మేనేజ్మెంట్ కి ప్రకాశం జోనల్ ఇన్చార్జి శ్రీకృష్ణ గణేష్ మరియు ప్రిన్సిపాల్ హెచ్ఎం టీచర్స్ అందరికి ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు అందించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేస్తున్న కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా చూడాలని కేంద్ర బృందం సభ్యులు ప్రభాత శర్మ, నందలాల్ గుర్జార్ అన్నారు. మండలంలోని మారెళ్ళ గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పోస్ట్ ఆఫీస్ ద్వారా వేతనాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. జాబ్ కార్డుదారులకు 150 రోజులు పని కల్పించాలని తెలిపారు. ఉపాధి వేతనాలు మే నెల నుండి రాలేదని కూలీలు కేంద్ర బృందానికి తెలియజేశారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోపన బోయిన వెంకటేశ్వర్లు ,వెలుగు ఏపీడి లక్ష్మీరెడ్డి, ఏపీ డి బసవ సుబ్బారావు, ఎంపీడీవో ఎం శ్రీదేవి, పంచాయతీ రాజ్ ఏ ఈ ఎం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పాలపర్తి సుబ్బారావు, ఏపీవో టి వెంకటరావు, ఈసీ జి శివరామకృష్ణ, పాల్గొన్నారు.

'పోక్సో'పై అవగాహన

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండలంలోని బొట్లగూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సై టి కిషోర్ బాబు ఉపాధ్యాయులకు పోక్సో చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై టి కిషోర్ బాబు మాట్లాడుతూ పోక్సో చట్టం అనేది లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టం. బాలబాలికల పై లైంగిక వేధింపులకు సంబం ధించి లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం 2012 మే 22న భారత పార్లమెంటు ఆమోదించింది ఇది ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్, 2012 నవంబరు 14 నుండి అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com మంగళవారం 29 । జులై । 2025

అసంబద్ధ డిప్యూటేషన్లను నిలిపివేయాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాలలో నూతన ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన టి.రమాదేవిని చీరాల ఎస్టీయూ సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీరాల మండలంలో అసంబద్ధంగా చేసిన టీచర్ల డిప్యూటేషన్ ఉత్తర్వులను నిలుపుదల చేయాలని, సిఎస్సి సూచనల మేరకు టీచర్లను సర్దుబాటు చేయాలని, ఉపాధ్యాయ సంఘాలతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఎంఈఓ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రావు, ఏసురత్నం, బి వెంకటేశ్వర్లు, కె సుబ్బారావు, టి వెంకటేశ్వర్లు, జీవీ సుబ్బారెడ్డి, రాంబాబు, టీ.ప్రభాకర్‌రావు, వై సుబ్బారావు, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలోని ఆముదాలపల్లి పంచాయతీ కొమరవోలు గ్రామంలో మల్లరపు ధనలక్ష్మికి చెందిన పూరిల్లు ఆదివారం అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది.దీంతో నిరాశ్రయులైన బాధితురాలుని సోమవారం జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, మండల తెలుగు యువత అధ్యక్షుడు పందరబోయిన శ్రీనివాసరావు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.ప్రభుత్వం నుండి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందే విధంగా కృషి చేస్తామని బాధితురాలుకి వారు భరోసా ఇచ్చారు.వారి వెంట విఆర్ఓ నాగలక్ష్మి, గ్రామ టీడీపీ నాయకులు ఉన్నారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

విశాలాంధ్ర - నిజాంపట్నం : అడవులదీవి - రేపల్లె మార్గంలోని రోడ్డుకు ఇరువైపుల పెరిగి ఉన్న పిచ్చి మొక్కల తొలగింపునకు అడవులదీవి పోలీసులు, గ్రామ పెద్దలు కలిసి సంయుక్తంగా చర్యలు చేపట్టారు.ఈ మేరకు సోమవారం జేసీబీని ఏర్పాటు చేసి పిచ్చి మొక్కలను తొలగింప చేయించారు.వాహనదారులు, పాదాచారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అడవులదీవి పోలీసులు, గ్రామ పెద్దల సంయుక్త సహకారంతో పిచ్చి మొక్కలను తొలగింపు చేస్తున్నట్లు అడవులదీవి ఎస్ఐ బత్తుల బాబురావు తెలిపారు.

అర్జీలు వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర - వేమూరు : ప్రజావాణిలో వచ్చిన గ్రీవెన్స్ అర్జీలను పరిష్కారం చేయాలని గ్రామ రెవెన్యూ అధికారులకు తహసీల్దర్ సుశీల సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో ప్రజావాణి లో వచ్చిన అర్జీలపై చర్చించారు.ఈ సందర్భంగా అర్జీల పరిష్కారం పై వారికి పలు సూచనలు అందజేశారు. సమావేశంలో డిటి రవీంద్ర, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

కార్మికుల రక్షణ కోసం 'దేవతోటి' కృషి

విశాలాంధ్ర - చీరాల టౌన్ : కార్మికుల రక్షణ కోసం కామ్రేడ్ దేవతోటి నాగేశ్వరరావు అహర్నిశలు పనిచేశారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ తెలిపారు. చీరాల ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ చీరాల నియోజవర్గ కార్యదర్శి బాచి పైడియ్య అధ్యక్షతన దేవతోటి నాగేశ్వరరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ దేవతోటి నాగేశ్వరరావు సుమారు 45 సంవత్సరాలుగా కార్మికవర్గ నాయకులుగా కార్మిక పక్షాన ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించిన ఘనత ఆయనకే సొంతమన్నారు. ఎర్రజెండాని నమ్మి ఎర్రజెండాతోనే ఉంటే కార్మికులకు రక్షణని ఎర్రజెండా కోసమే పనిచేసిన వ్యక్తిని అన్నారు.ఎన్నో సంవత్సరాలగా వారు వామపక్ష పార్టీలో పని చేశారని,రెండు సంవత్సరాలు అనారోగ్యంగా ఉండి ఆరోగ్యం నిలకడ అయిన తర్వాత డిసెంబర్ 2024లో ఏఐటీయూసీలో పనిచేయడానికి నేను సిద్ధంగా ఉన్నానని కోరగా 2025 జనవరిలో ఏఐటీయూసీలో చేర్చుకోవడం జరిగిందన్నారు. నాగేశ్వరరావు ఉద్యమ స్ఫూర్తిని చూసి మహాసభలో కార్యవర్గ సభ్యులందరూ మాట్లాడుకుని ఏఐటీయూసీ చీరాల నియోజకవర్గ అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నాటి నుంచి సీపీఐ ఉద్యమాలు, ఏఐటీయూసీ ఉద్యమాలు ముందు ఉండి పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఈ నెల 22వ తేదీన నాగేశ్వరరావు మృతి చెందటం బాధాకరం అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని పనిచేస్తారని, పార్టీ కోసం పనిచేయాలని కోరారు.అనంతరం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాసు,ఏఐటీయూసీ చీరాల నియోజవర్గ కార్యదర్శి బాచి పైడియా,చీరాల నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిరమల ప్రకాష్ బాబు,బీసీ ఫెడరేషన్ నాయకులు,మాజీ సర్పంచ్ ఊటుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో చీరాల మండల సీపీఐ కార్యదర్శి సైకం రాజశేఖర్,ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డొక్కా మాల్యాద్రి,బీసీ ఫెడరేషన్ మాజీ సర్పంచ్ సీనియర్ సిటిజన్ అధ్యక్షులు గాదే హరిహరరావు, ఏఐటియుసి చీరాల నియోజకవర్గ కమిటీ సభ్యులు బత్తుల వీరమ్మ,జొన్నాదుల భారతి, కుంచల వెంకటేశ్వర్లు, కె.పీటర్ పాల్, పి.ఎం.ఖాన్ పాల్గొన్నారు.

సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

కూరగాయల మార్కెట్‌ను మునిసిపల్ కమిషనర్ తనిఖీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై వ్యాపారస్తులకు మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి అవగాహన కల్పించారు. నందమూరి తారక రామారావు కూరగాయల మార్కెట్‌ను కమీషనర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాస్టిక్ మహమ్మారి వల్ల కలిగే అనర్ధాలు గురించి వివరించారు. కొనుగోలుదారులకు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల కాకుండా గుడ్డ సంచులలో మాత్రమే సరుకులను ఇవ్వాలని సూచించారు. నిత్య జీవితంలో ఇప్పటికే అధిక మోతాదులో ప్లాస్టిక్‌ను ఉపయోగించామని దానివల్ల భవిష్యత్తులో తీవ్ర అనర్ధాలు మనమే ఎదుర్కొంటారని తెలిపారు. ప్లాస్టిక్ భూమిలో అంతరించి పోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుందన్నారు. కూరగాయల మార్కెట్ చేపల మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్, సెక్రటరీలతో మాట్లాడారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు ఉపయోగించకుండా దుకాణదారులకు అవగాహన కల్పించి పూర్తిస్థాయిలో నిషేధించే విధంగా కృషి చేయాలని వారికి సూచించారు.ప్లాస్టిక్ పై చేస్తున్న ఈ యుద్ధంలో వ్యాపారస్తులు పట్టణ ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఏదైనా వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు ఇంటి దగ్గర నుండే గుడ్డ సంచులను తీసుకురావడం వలన కొంతమేర ప్లాస్టిక్ అమ్మకాలను నిర్మూలన చేయవచ్చని ప్రజలను కోరారు.ప్రజాహితం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఈ ప్లాస్టిక్ మహమ్మారి నిర్మూలన యుద్ధంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు సయ్యద్ నజీర్ ,సి.హెచ్.కరుణ,పురపాలక సంఘ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

ఎస్పీ తుషార్‌డూడి

విశాలాంధ్ర - బాపట్ల : అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. తమ సమస్యలను వెల్లబుచ్చుకోవడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. వారి సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు మరల మరల పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటివేధింపులు,ఆస్తితగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో మొత్తం 60 మంది అర్జీలను అందజేశారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, చీరాల డిఎస్పి మోయిన్, రేపల్లె డిఎస్పి శ్రీనివాసరావు, పి.జి.ఆర్.ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - నిజాంపట్నం : తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ నేత అనగాని శివప్రసాద్ ఎప్పుడు అండగా ఉంటారని రేపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము అన్నారు.మండలంలోని గరువుపాలెం పంచాయతీ గుణ్ణంవారిపాలెం - గౌడపాలెం కు చెందిన టీడీపీ కార్యకర్త కాటూరి వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.దీంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో సోమవారం కొలసాని రాము మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుడి కుమారుడు కాటూరి కోటయ్యకు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లపాటి ఎల్లయ్య, మోర్ల రాంప్రసాద్‌లు పాల్గొన్నారు.

దేవాంగపురిలో వికసిత్ భారత్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలం దేవాంగపురి గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న ఎస్ టీ కాలనీలో రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాల మేరకు నరేంద్ర మోడీ నినాదంతో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను వివరిస్తూ, ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాసిక శివాజీ, మేడికొండ భరణీ రావు, భాజపా నాయకులు, పాల్గొన్నారు.